క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



రేపల్లె: పట్టణంలోని 3వ వార్డు అరవపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నిజాంపట్నం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆముదాలపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కందుల తిరుపతిరావు వివరాల మేరకు..నర్రా మణికంఠ కృష్ణ కుమార్ (24) తెనాలి నుంచి ఆముదాలపల్లి వచ్చే క్రమంలో బావాజీపాలెం గ్రామ శ్మశాన వాటిక సమీపంలో మలుపు వద్ద ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. కృష్ణకుమార్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాధాకృష్ణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రాణాంతకంగా విద్యుత్తు స్తంభాలు



కొల్లూరు : కొల్లూరు – పెసర్లంక రహదారి అంచుల వెంబడి నిర్లక్ష్యంగా పడేసిన విద్యుత్ స్తంభాలు ద్విచక్ర వాహనదారుల పాలిట ప్రాణాంతకంగా మారాయి. ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణ సమయంలో సైడ్ బరమ్స్‌కు గ్రావెల్ పోయడంతో స్తంభాలు స్పష్టంగా కనిపించడం లేదు. రాత్రిపూట శక్తివంతమైన లైట్లతో ప్రయాణించే భారీ వాహనాల లైటింగ్‌కు రోడ్డు మార్జిన్‌లో పూడుకుపోయి ఉన్న విద్యుత్తు స్తంభాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని లంక గ్రామాల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం విద్యుత్తు శాఖాధికారులు స్పందించి స్తంభాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గడ్డి మందు తాగిన మహిళ మృతి

చావలి(వేమూరు): గడ్డి మందు తాగి మహిళ మృతి చెందిన ఘటన చావలి దళితవాడలో జరిగింది.పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన పోకూరి రత్తమ్మ(56)కు గతంలో ప్రమాదం జరిగింది. మందులు వాడుతున్నా నొప్పులు తగ్గక పోవడంతో ఈ నెల 26న ఇంటిలో గడ్డి మందు తాగింది. పిల్లలు చూసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం ఉదయం 5 గంటల సమయంలో మృతి చెందిందని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి సర్పంచులకు శిక్షణ తరగతులు

అమర్తలూరు(వేమూరు) : అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు 7వ తేదీ నుంచి 9 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మారుతీ శేషాంబ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ, ఇంటూరు, కోరుతాడిపర్రు, కూచిపూడి, మూల్పూరు తురుమెళ్ల, వామనగుంట పాలెం, యడవూరు గ్రామాల సర్పంచులు పాల్గొంటారని ఆమె చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. సర్పంచులంతా తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

క్షణం క్షణం భయం

- ప్రమాదభరితంగా మారిన కాలువలు
- సైడ్‌వాల్స్ విరిగి ఏళ్లు గడిచినా పట్టించుకోని అధికారులు
- వాహనదారుల గుండెల్లో దడ

బాపట్ల: అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జిలు నేటికి దర్శనం ఇస్తూనే ఉన్నాయి. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో కూడా తెలియకుండా ఉంది. బ్రిడ్జిల సంగతి దేవుడెరుగు...కనీసం ప్రమాదాల బారి నుంచి ప్రయాణికులను రక్షించేందుకు నిర్మించిన సైడ్‌వాల్స్ కూడా సరిగా లేవు. పూర్తిగా విరిగిపోయిన ఏ ఒక్క అధికారి దృష్టి సారించిన దాఖలాలు లేవు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని గ్రామస్తులు అనేక పర్యాయాలు వేడుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఆర్ అండ్ బీ, డ్రైనేజీ శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి రెండు, మూడునెలలకొకసారి ఆయా కాలువల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రమాదాలకు కేరాఫ్ వెదుళ్లపల్లి బ్రిడ్జి

మండలంలోని వెదుళ్లపల్లి–మురుకుంటపాడు మార్గంమధ్యలో డ్రైనేజీ పై నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సైడ్ వాల్స్ పూర్తిగా విరిగిపోయాయి. బ్రిడ్జి కూడా ఎప్పుడు కూలుతుందో తెలయకుండా ఉంది. వెదుళ్లపల్లి నుంచి మురుకుంటపాడు, కంకటపాలెం వెళ్లే ప్రజలు, వెదుళ్లపల్లి సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లే రైతులు, పశుపోషకులు నిత్యం ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు.



ప్రమాదభరితంగా మారిన వెదుళ్లపల్లి డ్రెయిన్

కాలువ కాదు.. నరకానికి తోవ

మండలంలోని పోతురాజు, కొత్తపాలెం నుంచి వెదుళ్లపల్లి సమీపంలోని జీబీసీ రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్డుకు మార్గంమధ్యలో పోతురాజు కొత్తపాలెం శివారులో ఉన్న ఎత్తిపోతల పథకాల వద్ద కాలువకు సైడ్‌వాల్స్, కనీసం దిమ్మెలు కూడా లేవు. దీనికి తోడు రోడ్డు కూడా చిన్నదిగా ఉండటంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఎదురుగా లారీ రావడంతో బెదిరిపోయి గేదెలు కాలువలో పడి మృత్యువాత పడ్డాయి.



పూండ్ల రోడ్డులో కల్వర్టు

అదమరిస్తే అంతే !

బాపట్ల నుంచి మూలపాలెం వెళ్లే దారిలో ఈస్ట్ స్వాంప్ డ్రెయిన్‌పై బ్రిడ్జి శిథిలావస్థకు చేరి సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కాలువ వెడల్పు తక్కువగా ఉండి చాలా లోతుగా ఉంటుంది. రోడ్డు కూడా చిన్నదిగా ఉండటం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జికి సైడ్‌వాల్స్ లేకపోవడంతో భారీ వర్షాలకు డ్రెయిన్ పొంగిన సమయంలో బాపట్ల రైలుపేటకు చెందిన ఇద్దరు యువకులు కాలువలో పడి కొట్టుకుపోయారు. స్థానికులు స్పందించి వాళ్లను కాపాడారు. ఉప్పరపాలేనికి చెందిన శ్రీనివాసరావు ఎనిమిది గొర్రెలు ఒక్కసారిగా మృత్యువాత పడ్డాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికు కనీసం సైడ్‌వాల్స్ అయిన నిర్మించాలి

తస్మాత్ జాగ్రత్త..!



అప్పికట్ల-మర్రిపూడి మధ్యలో కల్వర్టు

మండలంలోని అప్పికట్ల–మర్రిపూడికి మార్గం మధ్యలో పంట కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. కనీసం సైడ్ వాల్స్ కూడా లేకపోవడంతో నిత్యం ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు రోడ్డు బ్రిడ్జి ముందు చాలా డౌన్‌గా ఉండటం, అక్కడే మలుపు తిరగాల్సి రావడంతో వాహన చోదకులకు ఎదురుగా వస్తున్న కనిపించకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు గురికావాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్వర్టుకు సైడ్‌వాల్స్ నిర్మించి మలుపు తిరిగే ప్రదేశంలో ప్రమాద హెచ్చరికలు తెలియజేసే బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్టీసీ కార్మికుల గేటు ధర్నా

రేపల్లె: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు రెండవ రోజు శనివారం గ్యారేజ్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు కమలాకరరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సులను తొలగించి నూతన వాహనాలను మంజూరు చేయాలని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా బస్సు సర్వీసులను నడపాలని విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, అలవెన్స్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ మరకా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సాంబశివరావు, గ్యారెజ్ సెక్రటరీ మౌలాఖాన్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ముగిసిన నవ కోటి లలితా సహస్ర నామపారాయణ

రేపల్లె: మండలంలోని నల్లూరు శ్రీ గాయత్రీ వృద్ధాశ్రమంలో నవ కోటి లలితా సహస్ర నామపారాయణ శనివారంతో ముగిసింది. వృద్ధాశ్రమం నిర్వాహకుడు కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో 10 రోజులుగా మహిళలు లలితా అమ్మవారి సహస్రనామ పారాయణాన్ని కోటి సార్లు జపించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రేపల్లె ఆర్య వైశ్య కల్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో మద్ది బదరీ నారాయణమూర్తి, పద్మజ దంపతుల సహకారంతో నవధాన్యాలతో తొమ్మిది సంవత్సరాలుగా అమ్మవారికి ప్రతి ఏడాది ఒక్కొక్క ధాన్యపు రాశితో పూజిస్తున్నట్లు చెప్పారు. సంవత్సరానికి కోటి చొప్పున మహిళలు తొమ్మిది కోట్ల సార్లు అమ్మవారి సహస్రనామ పారాయణం చేసినట్లు తెలిపారు. చివరి సంవత్సరం అన్నపూర్ణాదేవి అమ్మవారికి ఉలవలతో పూజతో పాటు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు చెప్పారు. అమ్మవారి కృపతో ప్రజలు పాడిపంటలు, సుఖశాంతులతో వర్ధిల్లాలన్న సంకల్పంతో సహస్ర నామపారాయణం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి మహిళలు హారతులు పట్టారు.



పూజలందుకుంటున్న అన్నపూర్ణాదేవి

సమావేశానికి అధికారుల గైర్హాజరు సబబు కాదు

ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి

భట్టిప్రోలు (కొల్లూరు) : మండల పరిషత్తు సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు సమంజసం కాదని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకాకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అరకొరగా అధికారులు సమావేశానికి హాజరైతే మండలంలో ప్రభుత్వ శాఖల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతుందన్న విషయాన్ని గ్రహించాలని ఆమె తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలలో ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడంపై అధికారులను నిలదీశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిస్తేనే అభివృద్ధి సాధ్యమని, పరిపాలన సవ్యంగా ఉంటుందన్న అంశాన్ని ప్రభుత్వ యంత్రాంగం గుర్తుంచుకోవాలని సూచించారు. వర్షకాలం ఆరంభం అవుతున్న నేపథ్యంలో పంచాయతీ యంత్రాంగం, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. గ్రామాలలో పారిశుధ్య పనులతో పాటు ఎప్పటికప్పుడు రక్షిత మంచినీటి ట్యాంక్‌లను క్లోరినేషన్ చేసి, శుభ్రపరచడంపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు అవుతున్నా ఆలస్యంగా విద్యార్థులను పాఠశాలలో చేర్పించడంపై ఎంఈఓను ఆమె ప్రశ్నించారు. గ్రామాలలో లోవోల్టేజ్ సమస్య ఉత్పన్నమవుతుందని ఎంపీటీసీ సభ్యులు విద్యుత్తు సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిషత్తు నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి సమావేశంలో చర్చించారు. ఎంపీటీసీ సభ్యుల అభ్యర్థనలను పరిగణలోకి తీసుకొని సీసీ రోడ్లు, డ్రైన్లు, పైప్‌లైన్ల మరమ్మతులకు మండల పరిషత్తు నిధులు మంజూరు చేస్తామని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, ఏఓ సీహెచ్.జలజ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కర్లపాలెం: కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే కరీముల్లా, ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్ పిలుపునిచ్చారు. కర్లపాలెంలో శనివారం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర విధానాలపై కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరీముల్లా, శ్యామ్యూల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటల విధానాన్ని పెంచి కార్మికుల హక్కులు హరిస్తున్నాయని విమర్శించారు. గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎనిమిది గంటలుగా ఉన్న పని సమయాన్ని 10 గంటలకు మార్చడం, కేంద్రం ప్రభుత్వంలో 10గంటలుగా ఉన్న పని సమయాన్ని 12గంటలకు మార్చడం దుర్మార్గమని మండిపడ్డారు. పని గంటలు పెంచటం వల్ల మహిళా కార్మికులు రాత్రి వేళలో కూడా పని చేయాల్సి ఉంటుందని, మహిళలపై వేధింపులు అధికమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షేక్ జిలాని, ఉపాధ్యక్షులు శవనం కోటిరెడ్డి, కార్మిక నాయకులు అక్కల నాగిరెడ్డి, సింహాద్రి, శివయ్య, బాబుల్, కాశిం, దావీద్ పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు

తెనాలి టౌన్: మండలంలోని నందివెలుగు గ్రామంలో కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో గత నెల 26 నుంచి జరుగుతున్న శ్రీ వారాహిదేవి అమ్మవారి నవ రాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. భక్తుల సహాయ సహకారాలతో అర్చకులు గోపరాజు హేమంత్‌వర్మ ఆధ్వర్యంలో చివరిరోజు అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు, వారాహి యంత్రార్చన హోమాలు జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కొలకలూరి శ్రీనివాసశర్మ, బాల విశ్వనాథశర్మ, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

పూరిల్లు దగ్ధం



నగరం: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన శనివారం పూడివాడలో జరిగింది. గంగాధరరావుకు చెందిన పూరింటి నుంచి ఒక్కసారిగా మంటలు రేగి, పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం వాటిల్లలేదు. మంటల్లో ఇంట్లోని విలువైన వస్తువులతో పాటు సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితుడు గంగాధరరావు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రమాద విషయాన్ని స్థానికులు రేపల్లె అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో, హుటాహుటిన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

రెండో రోజు కొనసాగిన ఉద్యోగుల ఆందోళన



తెనాలిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారాలని కోరుతూ ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో తెనాలి ఆర్టీసీ డిపోలో శనివారం కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హత ఉన్న ఉద్యోగులందరికీ పదోన్నతులు ఇవ్వాలని పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్‌ఖన్నా, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎస్.సుధాకర్, నాయకులు వి.ప్రసన్న జ్యోతి, జి.భూలక్ష్మి, కె.విజయలక్ష్మి, బి.కళావతి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడం బాబు నైజం

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నాయుడు నైజం అని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి విమర్శించారు. కర్లపాలెంలోని పెద్దింటమ్మ కల్యాణ మండపంలో శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘుపతి ముందుగా నాయకులతో కలసి పెద్దింటమ్మకు పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామాల్లోకి వెళ్లి రచ్చబండ కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ప్రశ్నించేందుకే రాజకీయాలలోకి వచ్చానని గతంలో పదే పదే చెప్పిన పవన్ కల్యాణ్ చంద్రబాబును ఎందుకు ప్రశ్నించడం లేదని కోన నిలదీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, బాపట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిక్కాల సాగర్, పార్టీ నాయకులు ఎస్‌కే ఆసిఫ్, రాతంశెట్టి లక్ష్మణరావు, యారం ఇసాక్, అక్కల శ్రీనివాసరెడ్డి, యల్లావుల సురేష్ రాదవ్, దబ్బుకూటి ఏడుకొండలు, దేవరకొండ రమేష్, కావూరి శ్రీనివాసరెడ్డి, మందపాటి పరమానందకుమార్, పేరాల వెంకట సురేష్, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, దొంతిరెడ్డి శివారెడ్డి, కేసాని వరప్రసాద్, కారంకి ప్రసాద్, ఎస్‌కే జాకీర్ హుస్సేన్, దొంతిబోయిన జయభారత్‌రెడ్డి, మార్పు రత్నం, షేక్ సలాం, మరకా పెద వెంకటేశ్వర్లు, గరిగంటి కిరణ్, పెరుగు సాంబశివరావు, ఎస్‌కే జిలాని, శీలం వీరారెడ్డి, పాపారావు, బెనర్జీ, పాములపాటి శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, పులుగు స్వామిరెడ్డి, మనోహర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘుపతి

డెంగీ, డయేరియాపై అప్రమత్తత అవసరం

నిజాంపట్నం: డెంగీ, డయేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగార్జున సూచించారు. డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా శనివారం దున్నావారిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. పగటిపూట దోమ కాటుతో డెంగీ వ్యాధి వస్తుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. వ్యాధి సోకిన వారిలో తీవ్ర తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, అలసట తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పాత టైర్లు, డబ్బాలు, కొబ్బరి బొండాలు, వాడిన కూలర్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఇంటి పరిసరాల నుంచి తొలగించాలని తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మురళి, కాసులు, ఆశా కార్యకర్త వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సమ్మెలో కార్మికులంతా ఐక్యంగా పాల్గొనాలి

సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెలో కార్మికులు ఐక్యంగా పాల్గొనాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్. మణిలాల్ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆయా కార్మిక సంఘాల నాయకులతో ఆర్టీసీ, ఐసీడీఎస్, పీహెచ్‌సీ, రైస్ మిల్ యాజమాన్యాలకు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, కార్మిక హక్కులను కాపాడాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదనే తదితర డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కె.ఝాన్సీ, వై.మేరీమణి, కె.రత్నకుమారి, కె.కృష్ణకుమారి, సుబ్రహ్మణ్యం, ఇమ్రాన్, సీహెచ్. వీరలక్ష్మి, వి.సుబ్బారావు, యు.రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నాయకులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

వేమూరు: కార్మికులంతా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. తామంతా సమ్మెలోకి వెళుతున్నట్లు శనివారం కార్మికులు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తూ కేంద్రం ప్రభుత్వం తెచ్చిన చట్టాలను వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొనిగల అగస్టీన్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు విఘాతం

క్రోసూరు: కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు విఘాతం కలుగుతుందని సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షులు తిమ్మిశెట్టి హనుమంతరావు అన్నారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ క్రోసూరులోని గాంధీ బొమ్మల వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిల్కా ఏషియ్య , బత్తుల కొండలరావు, కంభంపాటి మల్లికార్జునరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం

తెనాలి: అనారోగ్య కారణంగా కొద్దిరోజులుగా వృత్తిని కొనసాగించలేక ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్ఎస్ఎస్ రాముకు వీడియోగ్రాఫర్ అండ్ ఫొటోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ శనివారం రూ.10 వేల ఆర్థికసాయం, బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసరాలను అందజేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుద్దపల్లి సాంబయ్య, కార్యదర్శి బాబీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సునీల్, ఉపాధ్యక్షుడు గౌతమ్, కుర్రా మహేష్, సిద్దుల సాయినాథ్, జొన్నాదుల మణి, గిరి, వేము రామరాజు, విజయ్, వసంత్ పాల్గొన్నారు.